# మార్గములో

శ్రీ. ఎస్. ఎస్. రంగస్వామి

విశాలమైన పర్వతపు ఒడియందు పచ్చపచ్చని పొలములతో కూడిన ఒక చిన్న గ్రామము వుండెను. దాని జనసంఖ్య సుమారు నాలుగువందలు. అందు అన్ని జాతుల మనుష్యులును వుండిరి. గ్రామము చివర భాగమున కుమ్మరివాండ్రు, అటుతరువాత సాలెవాండ్రు నివసించుచుండిరి. సాలెవాండ్ర బస్తీకొనయందు సుఖియా ఇల్లు కలదు. నేటికి సుఖియాపతి చనిపోయి పది సంవత్సరములు గడచినవి. అప్పటినుంచి ఆ దీనురాలు నూలువడుకుట, పిండి విసరుట మొదలుగాగల పనులతో జీవనము గడుపుచుండినది. సుఖియాకు పదునాల్గు వత్సరముల కూతురు కలదు. ఆపిల్లయే సుఖియాకు సహాయముగా నుండెను. ఆ పిల్లకారణమున సుఖియా తన వైధవ్యజీవనమును సుఖముగా, శాంతముగా, సరళముగా గడపుచుండినది. పిల్ల పేరు 'కేసరి' కాని ప్రేమచే 'కేసో' అని పిలువబడుచుండినది. సుఖియా యొక్క జీవనమే కేసో. ధన-ధాన్యము, సుఖ-వైభవము, మరి ఇక ఏమైనా కానీ అంతా కేసరి. సుఖియా ఆమెను కుమారునిగానే పోషించెను. ఒకనాడు కేసరి జబ్బుపడినది. సుఖియా అర్ధరాత్రి మందుకొరకు గంగారాముని ఇంటికి వెడలినది. చలి మిక్కుటముగ నుండినది. వర్షముకూడ కురియుచుండినది. వెలుపలి కెవ్వరుగాని పో సాహసింపని యీ యర్ధరాత్రి వైద్యుని వద్దకు పోయి సుఖియా "నా కేసరికి మందు నొసగుడు. లేనిచో అది మృతి నొందగలదు" అని విన్నవించుకొనినది. అనగా సుఖియా కేసరిని తన ప్రాణముతో సమానముగా ప్రేమించుచుండినది.

కేసరి బోళా స్వభావము కలది. చిరునవ్వులతోడి బాలిక. మాటమాటకు నవ్వి జవాబు చెప్పును. తల్లి పలుమారు మాన్పించినది, కాని అది ఆ బాలిక స్వభావము. ఇప్పుడునూ అదే విధముగా బాలురతో కలసి ఆడజొచ్చెను. తల్లి చెప్పి చెప్పి ఫలము లేక పోయినది. గ్రామములోని గొఱ్ఱెలను మేపుట ఆమె పని. ఇంటికి వచ్చినతోడనే పిడకలు తట్టును.

ఇప్పుడు కేసరియందు యౌవనకాంతి కాన్పించ మొదలిడినది. గోధుమవర్ణము శరీరమందు మిక్కుటముగా ప్రకాశింప తొడగినది. కన్నులయందు అత్యంత సుందరత్వము కనుపడుచుండెను. వానియందు నిషా కలిగించునట్టి మనోహరత్వము కలదు. ఆ బాలిక సమీపమందలి లోయలో గొఱ్ఱెలను మేపును. గ్రామ సంబంధమైన గానము కావించును. మరియు గొఱ్ఱెలతో మాట్లాడును. అవి తప్ప ఆమెకు మరియే మిత్రుడును లేడు.

లోయకు ఆవల మనోహరమైన ఒక గొప్ప కొలను వున్నది. దాని సమీపమున మామిడిచెట్లు కలవు. నీటియందు కమలములు వికసించియుండెను. కేసరి కమలములను కోసి మాలెలు కట్టి అనురక్తనేత్రములతో గొఱ్ఱెపిల్లలను కాంచి, వాటి మెడలో వేయును. ఇప్పుడా బాలికకు ప్రకృతిదృశ్యములయందు ఆనందము కలుగుచుండెను. ఆమెహృదయము కవిహృదయమాయెను. ఏ విధముగా కవి ప్రకృతిదృశ్యములయందు అద్భుతమైన శోభను వెదకునో, అట్లే ఆమె ఏకాంతమనస్సు ప్రకృతిసౌందర్యమును కాంచి మోహించినది.

ప్రాచీదిశనుంచి ప్రభాతపు స్వర్ణ కిరణజాలము నెమ్మది నెమ్మదిగా ఆకాశమందు వ్యాపించుచుండినది. పక్షులు గూండ్లనుండి ఆహారముకొరకు పోవుచుండినవి. కేసరిమాత్రము ఎట్లు ఊరకుండగలదు? ఆమె కూడ గొఱ్ఱెలను కూర్చుకొనెను. ఈ సమయమున దారిలో ఆ గ్రామపు సేటుకొమారుడు చతురసేనుడు కలిసికొనెను. చతురసేనుడు సమీపములోని పర్గానా మిడిల్

స్కూలులో చదువుబాలుడు. కేసరి నవ్వి పిలిచెను—
"ఓహో! చతురా!"

చతురసేనుడు తిరిగిచూచెను. సుఖియా కూతురే.

"ఏమి?" అనెను.

"ఆలస్యముగా బడికి ఏల పోవుచున్నావు?"

చతురసేనుడు నిలిచెను. కేసరి వానిని సమీపించినది. అట్లే నవ్వుతూ ప్రశ్నించినది— "ఏల ఇంత ప్రొద్దుపోయినది?" చతురసేనుడు డగ్గుత్తికతో పలికెను— "తల్లి జబ్బుగానున్నది. అందుచే వేళ మించినది. నేను తప్పక దెబ్బలు పడుదును!"

"అయితే ఎందుకు పోయెదవు? ఇంటికి మరలుము."

వ్యగ్రతను తెలియబఱచుచూ చతురసేనుడు ఇట్లు పలికెను:—

"కేసరీ! ఇంటియందును దెబ్బలే!"

కేసరి ఇప్పుడుకూడా నవ్వ మొదలిడినది. చతురసేనుడు ఆ ముఖచంద్రమును చకోరమువలె అట్టే చూచుచుండెను. కేసరి సమస్యను పూర్తిచేసిన విజయివీరునివలె ఇట్లు చెప్పెను—"అటయితే, నాతోకూడ గొఱ్ఱెలను మేపుదువుగాని రా."

చతురసేనునకు ఈమాట బాగా నచ్చినది. తనకు ఈమార్గమే వుత్తమము అని అతడు యోచనచేసెను, ఎందుకనగా "రేపు పాఠశాలలో మాతల్లికి జబ్బు అని తప్పించుకొందును. ఇంటికి సరియైన సమయమునకు మఱలి పోవుదును" అని కేసరిబుద్ధిని పొగడమొదలిడెను. అతనిస్థితి ఆకలితోకూడిన బిచ్చగానివలె నుండెను. పగలంతా అడిగి, అడిగి పైసా దొరకక, చీకటిపడి, నిరాశ చెందినట్టి సమయమున హఠాత్తుగా ఎవడో ఒకడు రూపాయ ఇవ్వగా వాడు అతనికి ఎంత కృతజ్ఞత తెలియపరచునోగదా! అట్టిదశ చతురసేనునకు కలిగెను. అతడు కేసరియొక్క ఆ సలహాకు ఋణగ్రస్తుడాయెను. ప్రసన్నుడై చిరునవ్వుతో "సలహా బాగాయున్న" దనెను. లోయ సమీపించినది. కేసరి మొదట గొఱ్ఱెలను నీళ్లు త్రాగించెను. తర్వాత, మామిడిచెట్టుయొక్క చల్లని నీడయందు, పచ్చపచ్చని గడ్డిపోచలను తివాసీగా పఱచి దానిపై చతురసేనుని కూర్చుండ చేసి తానునూ కూర్చొని, మాటిమాటికిని "నీరు త్రాగదవా?" అని అడుగ మొదలిడినది. చతురసేనుడు తల నాడించెను. అతిథి ఇంటికి వచ్చినప్పుడు అతనిని సత్కరించుటయందు గృహస్థుని స్థితినిబోలి కేసరియొక్క దశ అగపడెను. ఆమె అతని మనస్సును ఆనందపరచుటకు పాడెను. చతురసేనుడు మౌనము వహించి ఆసుమధుర గానమందు లీనమయ్యెను. అతడు ఆమె ముఖకమలము చూడ జొచ్చెను. ఇంతకుపూర్వము కూడ కేసరిని చూచెను, గాని నేడు దానిశోభ, సౌందర్యము అపూర్వము. ఈదినమున దానియందు విలక్షణమైన ఆకర్షణ కలదు.

గాలియొక్క కదలికచే కేసరిపై చెంగు తొలగినది. చంచలమైన సమీరము, తుమ్మెదలబోలు ఆమె ముంగురులతో క్రీడించుచుండెను. సరస్సునందు కమలములు నవ్వదొడగెను. చతురసేనుడు నిట్టూర్పు పుచ్చి—

"కేసో! అటు చూడుము, కమలములు ఎంత సుందరముగా నున్నవో" అనెను.

"అవును, నేను ప్రతిదినము వీటితో ఆడుకొందును. త్రుంచెదనుకూడా. నీకు కావలెనా?"

అని పలికి కేసరి కమలములను త్రుంచి చతురసేనునకు ఒసగినది. చతురసేనుడు కమలములను హృదయమందు చేర్చెను. కేసరి గొఱ్ఱెలను ప్రోగుచేసెను. చతురసేనునకు ఇంటికి పోవుసమయమైనది. అందుచే అతడు గ్రామమునకు మఱలెను.

## ౨

లాలా పూరణమల్లుడు ఇక్కడి జనులలో ధనవంతుడు, గౌరవవంతుడైన ఒకవ్యక్తి. గ్రామమందు అతనికి పలుకుబడి ఎక్కువ. అందరూ అతనికిఋణస్థులు. ఎవరికిని తల ఎత్తుటకు ధైర్యము లేదు. తండ్రి కేవలము నాల్గువందల రూపాయలు వదలిపోయెను. దానిని తన తెలివి తేటలచే పదివేల రూపాయల రొక్కముగా చేసెను. పరమాత్ముడు కేవలము వర్తకునే ధనముకూడ

బెట్టుటకు సృష్టించినాడని లోకోక్తి — మనము రాత్రిందివములు ఒకటిగా చేయుదుము, అబద్ధమాడుదుము, ఎన్నెన్నియో చేయరాని పనులు చేయుదుము కాని డబ్బుకూడుట అగుపడదు. లాలాకు చతురసేనుడు ఒక్కడే సంతానము. అతడు కొమారుని ఎక్కువగా ప్రేమించుచుండెను. చతురసేనుడు చెప్పినదే ఆలస్యము, అతడు వీనికోరిక నెరవేర్చును. అతనికి ఇప్పుడు ౧౮ వత్సరముల వయస్సు. కాని అతని చేత ఒకగలాసు నీళ్లనుకూడ తెప్పించడు. అతడు కోరినచో పని చేసిపెట్టును. లాలాకు అమితగర్వము. తన కొమారుడు టెలిగ్రాము చదువగలడని పదిమందిలో కూర్చొని తన పుత్రుని పొగడుచుండును. "ఒక రోజు 'దీనా' సోదరుడు 'చుంగీ' మున్షీ వద్దకు టెలిగ్రాము తీసికొనిపోగా అతడు చదువలేకపోయెను, కాని చతురునకు ఇవ్వగానే వెంటనే చదివెను. ఒకడు ఒకరోజున జనులలో కూర్చొని 'నాకు తారీకు సంవత్సరము తెలిపిన ఆదినము ఏవారమో చెప్పగలను' అనెను. నేను వానిని పరీక్షించవలెనని నా లెక్క పుస్తకములోనుండి ఒక తారీకు, సంవత్సరము, నెల, చెప్పితిని కాని వారమేమిటో అతడు చెప్పలేదు. సోదరా! నిజము చెప్పుతున్నాను. మా చతురుడు నాలుగు అయిదు నిమిషములలో వారము చెప్పినాడు." ఈవిధముగా చతురసేనుని పొగడ్త అనే వంతెన కట్టబడుచుండెను. చతురుడునూ తాను చతురుడనియే అభిప్రాయపడెను, కాని గర్వపడుటలేదు. ఎవరైననూ చదవడమునకు పిలిచిన నిరాకరించువాడు కాదు. చతురసేనుడు తన క్లాసులో పేరు వహించియుండెను. శ్రద్ధతో చదువును. చదువు తప్పించి దినమంతయు ఆడుబాలురతో చేరువాడుకాదు.

ఆ దినమున చతురసేనుడు ఇంటికి మరలెను. అతనిముఖము వాడియుండెను. చదువుటకు లక్షప్రయత్నములు చేసెను, కాని మనస్సు దానియందు లేదు. అతని హృదయమందు భావనలు నదిలోని తరంగములవలె, లేచుచూ పడుచూ విలీనమై పోవుచుండెను. ఇంతకుముందు ఎన్నడూ లేనట్టి భయంకరమైన ఆందోళన హృదయమందు కలుగ జొచ్చెను. చెవి సుమధురగానముతో నిండినది. మెదడులో ఆలోచన సాగుచుండెను. మనస్సులో ఇట్లు విచారింపదొడగెను.—"అది నీచజాతి......సాలెవానికూతురు, నేనో వైశ్యుడను. అ దెక్కడ నే నెక్కడ!" మరియొక ఆలోచన—అది నా మోస్తరు మనిషియే కదా!" మరల—"కాని ధర్మము..."? మరియొక భావన: "ఆనాడు హెడ్మాస్టరు—"ఏది ఎవనికి వుత్తమముగా తోచునో, అదియే వాని ధర్మము" అని చెప్పలేదా?

నేడు అతని కండ్లముందర కేసరి రూపరాశి ప్రత్యక్షమాయెను. ఆ కమలమువంటిముఖము, ఆ రసవంతమైన పలుకులు ఆ మధురమైన నవ్వు అతని ఎదుట తోచెను. ఈదినమున అతని చెవులయందు మోహము గొలుపునట్టి సంగీతము మ్రోగుచుండెను. ఆరాగము హరిణములకు ముగ్ధత్వము కలిగించును. నయన ఫలకములు చలనచిత్రములు, సినిమాచిత్రములవలె ప్రదర్శింపబడుచుండినవి. అతనికి నేడు ప్రపంచము సౌందర్యమయముగా తోచెను. అంతయూ, స్వర్ణచిత్రములుగాను, రూపరాశిగాను అగపడెను. ఆరూపరాశి మధుకరములను మోహింపజేయునట్టిది. అతడట్లే గంభీర భావముతో కూర్చొనెను.

లేత పద్మదళములతో ప్రభాకరుని కిరణజాలము క్రీడించుచుండినది. సంధ్యాసుందరి చేతిలో నక్షత్ర దీపము నుంచుకొని ఆవైపున వుండు తిమిరపటలము వైపుపోదొడగినది. చెట్లయందు పక్షుల కలకలారావములు వినబడుచుండినవి. రాధ వచ్చి-"ఏమియోచించుచున్నావు, నాయనా? " అని యడుగ "ఏమియు లేదు"—అని చతురసేనుడు నిలబడెను.

రెండవదినమున చతురసేనుని మనస్సు చదువునందు లగ్నము కాలేదు. అతడు సంజ్ఞాహీనుడై మౌనము దాల్చెను. నేడు అతనికి ఏదీ బోధపడలేదు. ఇండ్లకు పోవుసమయమైనది. కాని చతురసేనుడు మౌనముగా కూర్చొనియే యుండెను. ఒక బాలుడు అతనిబుజముపై చేయి వైచి చతురూ! చాల నీరసముగా వున్నావేమని అడిగెను. నవ్వయత్నించుచూ చతురూ నిలువబడెను. స్కూలునుండి బయలుదేరెను. గదిలోనే లోయకలదు. కేసరివైపుకు పోయెను.

హృదయము కంపించుచుండెను. అడుగు లుంచుట దుర్భరముగా తోచెను. కాని, ఏదియో ఒకపిలుపు అతనిని తీసుకొనిపోవుచుండెను. అత డిట్లు తలపోసెను– 'ఆమె ఏమనుకొనునో? నావెంట ఇల్లిల్లు తిరుగుచున్నా డని తలచునేమో? ఏమయిన చెప్పనేమో బెదరించిన, ఏమగునో కదా?'

లోయ వచ్చెను. కేసరి మాల కట్టుచుండెను. ఆమెదృష్టి క్రిందివైపు వుండెను. చతురసేనుడు నిలవబడి పోయెను. అతడు అనేకనిమిషములవరకు ఆరూపామృతము గ్రోలజొచ్చెను. మాలకట్టిన తర్వాత పశువులను చూడగోరి కేసరి ముఖము పైకెత్తినది. ఎదుట చతురసేనుడు వుండెను. ముసిముసి నవ్వులతో

"రా, చతురా!"

"ఎండజాస్తిగా వున్నది."

"కూర్చొనుము"

"నేను పోవుచున్నాను రొట్టె తినవలెను" అని అన్నాడు కాని చతురా కూర్చొనవలెననియే కోరుచుండెను. అతడు ఆరూపమాధుర్యమును పానము చేయ తలచుచుండెను. ఆ అజ్ఞాతహృదయమువల్ల కలిగిన పిపాసను తృప్తిపొందింపవలె నని కోరెను. కాని సిగ్గు అతనిని కూర్చొన నివ్వలేదు. అతడు నవ్వుచూ పోవుటకు ప్రయత్నించెను.

"చతురా!" ఆమెకండ్లు ప్రశ్నింప తొడగినవి.

"ఆ."

"ఈ హారము..."

"హారమా!" "ధరించుము."

చతురా హారమును తీసికొనెను. ఇంటిదారి పట్టెను. ఉదాసీనుడుగా నుండెను. వాని దశ స్వయముగా జూదమాడునట్టి స్థలమునకు వెళ్లి ఓడివచ్చిన జూదరిస్థితివలె ఆయెను. చతురుడును తనది యావత్తు ఇచట ఓడిపోవుచుండెను. మనస్సేమో లోయవైపు, అతడుమాత్రము ఇంటికి పోవుచుండెను.

ఒకనాటిరాత్రి కేసరికి నిద్ర పట్టలేదు. ఆమె విశాలమైన ఆకాశమును చూడ దొడగినది. మానము... కాని ఏదియో చదువుటకు ప్రయత్నించుచుండినట్లుండినది. వెన్నెల వికసించుచుండినది. ఆజీర్ణకుటీరములోని పైకప్పునుంచి, భయపడుచూ, భయపడుచూ, ప్రవేశించుచున్నట్లుగా వెన్నెల అగుపడినది. కొంచెము సేపటికి నిద్రపట్టినది. ఆమెనిద్రలో కలువరింపసాగినది.

"చతురా"!

"ఏమికేసో",!

"లేదు, ఏమీ లేదు"!

"ఏదో చెప్పుము"

"నేను ...
నేను......"

కేసరిముఖము ఎఱ్ఱదనము దాల్చెను. నోటినుంచి మాట రాలేదు. సిగ్గును దాల్చినది. కాలిగోటితో భూమిని గీర మొదలిడినది. చతురా మందస్మితముతో పలికెను – "ఏమి పలుకగోరెదవు? చెప్పరాదా."

"ఇదియే, నేను నిన్ను ప్రేమించుచున్నాను"

"నేనునూ నిన్ను ప్రేమించుచున్నాను. కేసో?"

కేసరి సంకోచముతో నిలువబడినది. "చెప్పుము కేసరీ!" "అవునా......" అదియేలోయ. ఆసరస్సే. అల్లే కమలములు నవ్వుచుండినవి. బాతులు ఈదుచుండినవి. మామిడికొమ్మపై నెమలి కూయుచుండెను. సరస్సుఒడ్డున ఒకపడవ కలదు. చతురా చేయి పట్టుకొని "రమ్ము, కేసో, కూర్చుందము." అనెను. సరె యని ఇద్దరూపోయి పడవపై కూర్చుండిరి. కేసరి ముఖమున చిరునవ్వు పొడమెను. చతురా పడవను నడిపెను. కేసరియొక్క కోమలమైనవేళ్లు సరస్సులోని శుభ్రమైన జలమందు క్రీడనము కావించుచుండినవి. పడవ నడిమిభాగమునకు వచ్చెను. కేసరి నవ్వుచూ పలికెను—

"చతురా"

"చెప్పుము, కేసో!"

"ఇక నడపకుము. పడవను వదలు; దానినే పోనిమ్ము"—

పడవ నిర్మల జలమందు స్వేచ్ఛగా పోవుచుండెను. కేసో పలికెను.—

"చతురూ!"

"ఏమి?"

"అటు చూడుము, ఎంత అందముగా నున్నది?" ఒక కమలమును చూపి కేసరి పలికెను. కమలము మలయపవనము యొక్క త్రోపుడుచే మరొక కమలమును నెట్టుటకు ప్రయత్నించుచుండెను. "తోయుదునా?" అని చతురూ దానివైపుకు వంగెను. నావ మరొకవైపు నెట్టబడెను. నావ తలక్రిందైనది. చతురూ, కేసో ఇద్దరు మునుగుచుండిరి. కేసో గట్టిగా అఱచెను. స్వప్నభంగమాయెను. "ఆహా...హా"- తల్లి మేల్కొనెను.

"ఏమది అమ్మాయి?"

సందేహపడుచూ కేసో జవాబిచ్చెను—

'అమ్మా చెడ్డకల'

చతురసేనుని ప్రేమ దీపముతో సమానముగా నుండెను. దీపము స్వయముగా మండును. కాని నిట్టూర్పు విడవదు. మౌనముగా శాంతముగా చమురు వుండునంతవరకును వెలుగును. అట్లే అతడును విరహబాధ పడుచుండెను. అతడు రోజురోజు క్రొత్తక్రొత్త యోచనలతో పోవును. కేసరిని సమీపించినతోడనే మఱచిపోవును. ఒకనాడు చతురసేనుడు మిగులసాహసముతో పోయెను. నేను ఈప్రకారము నావేదనను వినిపించెదను. ఆబాలికహృదయము కరిగిపోగలదు. అని అతడు యోచనచేసెను — లోయ సమీపించినది. అతడు మౌనముగా పొదచాటున కూర్చొనెను.

కేసరి రాతిబండపై కూర్చొని, సరోవరమందలి నిర్మలజలమందు కాళ్ళను వ్రేలాడవేసి ఇటు నటు కదల్చుచుండెను. మౌనము వహించి క్రిందివైపు చూచుచుండినది. పై ముసుగు తొలగినదికూడ ఆమెకు తెలియలేదు. ఆమెనవ్వు ఏవిషమ అంతరాళమందో లీనమైనది. ఇప్పుడు ఆముఖమందు కేవలము ఉదాసీనత అగుపడుచుండెను. హృదయములో ఏదినో బాధగా నున్నట్లు తోచెను. తుమ్మెద హృదయమందును పతంగము యొక్క హృదయమందును దీపము విషయమున నెట్టి బాధ కలుగునో అట్టిదియే నేడు కేసరిని కష్టపెట్టుచుండెను.

చతురసేనుడు ధైర్యము వహించి అడుగుల చప్పుడు సేయక పోమొదలిడెను. కేసరివెనుక నిలువబడెను. కాని కేసరి ఇప్పుడునూ నిశ్చలభావముతో కూర్చొని యుండినది. చతురసేనుని హృదయము కొట్టుకొనుచుండెను. అతనిముఖము ఎఱ్ఱబారెను. కన్నులను మూయకోరెను. కాని అజ్ఞాతభయముచే అట్లు చేయజాలకపోయెను. బుజముపై చేతిని వుంచెను. కేసరి అదరిపడెను. నవ్వుచూ దృష్టిని క్రిందికి త్రిప్పినది. చెవివరకు ముఖము ఎఱ్ఱదనము దాల్చెను. చతురసేనుడు సాహసముతో—"నేను నిన్ను ప్రేమించుచున్నాను." అనెను. "......" కేసరి వాలుకన్నులలో జవాబు అగపడెను. అతడు ఆమెసమీపమున జరిగికూర్చొనెను. రెండు శరీరములు ఏకమయ్యెను. హృదయమందు మధురకంపనము ఆరంభించెను. ఆ స్పర్శమందు ఉన్మాదము కలదు. చతురసేనుడు కేసరిని బాహుపాశమందు చేర్చుకొనుచూ — "నేడు సంతోషకరమైన దినము!" అనెను.

వాస్తవముగా అది ఆనందమైన దినము. మధురమైన కలయిక. ఇద్దరి హృదయములయందు ప్రేమభావనలు కలవు. నయనములందు క్రొత్త అనురాగముండెను. సరోవరము, మలయపవనముచే అలలుకూడినదాయెను. తామరపువ్వులు నవ్వ మొదలిడెను. తీగలు వ్రేలాడజొచ్చెను. మావిమొగ్గపై కోయిల 'కుహూకుహూ' అని కూయుచుండెను. సూర్యునికిరణములు మామిడి చిగురులగుండా వచ్చుచుండినవి. ఇద్దరి ముఖములయందు ఉల్లాసము కలదు. మోహమును గొల్పునట్టి కనురెప్పలను ఆడించుచూ కేసరి — "నిజము, నేడు ఆనందకరమైన దినము!" అనెను.

## 3

ఆరునెలల తర్వాత — కేసరి, చతురుడు కలిసి మెలిసి ఒకటిఅయిరి. వారిశరీరములువేరు, కాని ప్రాణమొకటే. స్కూలునుంచి మరలునపుడు చతురూ కేసరి ప్రక్కన కూర్చొనును. కేసరి నవ్వును, చతురుడునూ నవ్వ మొదలిడును. కేసరి పొదరిండ్లలో దాగును. చతురు వెదకి పట్టుకొనుటకు ప్రయత్నించును. పట్టుపడగానే ఇద్దరును నవ్వుదురు. ఇవియే వారి సంతోషకరమైన దినములు. ఒకరోజు ఇట్లే వారు ఆడుకొను

చుండిరి. దీనూ కార్యవశమున ప్రక్కనున్న పరగణాకు పోవుచుండెను. వారి ఆటనుచూచి నిశ్చేష్టుడయ్యెను. వారు చేతులు కలుపుకొని నవ్వుచుండిరి. దీనిని చూచి దీనూ మండిపడెను. కాని సాహుజీకొమారుడు, మరి యొకడు అయినచో ఖూనీచేసియుండును. ఎట్లో ఒకట్లు కోపమును దిగమ్రింగి వెడలిపోయెను. ఇంటికి వచ్చి కూర్చొని తనభార్య రాధతో

"హా, రాధా! కలియుగము వచ్చినది, కలీయుగము !"

"ఏమయినది?"

"ఏమీ లేదు"

"అయిన ఇట్లేల నిట్టూర్పు విడిచెదవు?"

"ఏమని చెప్పుదును. ఘోరమైన కలియుగము వచ్చినది!"

"చెప్పరాదా?"

"ఏమని చెప్పుదును?"

"చెప్పవద్దు, ఎక్కువమాటలు మాత్రము ఎట్లు చెప్పగలవు."

నాకు చెప్పుటకు ఇష్టములేదు. "కాని నీతో చెప్పెదను. మాటను రహస్యముగా వుంచవలెసుమా!"

"అవును, అవును"

"సాహుజీకి కొడుకు వుండలే"

"ఆ, ఆ"

"సుఖియా కూతురు"

"అయితే?"

"నీవు వట్టిపల్లెటూరు మనిషివి".

రాధ ఈ విషయమును పెంచి ఒక స్నేహితురాలితో చెప్పినది. అది మరియొకరితో ఒట్టుపెట్టించుకొని రహస్యమును వెలిబుచ్చెను. అట్లే ఒకతె మరియొకరితో చెప్ప మొదలిడినది — "నీకు తెలియదా?" "ఏమది?". "అదే, సుఖియాకూతురు సమాచారము." "తెలియదు." అది వృత్తాంతమంతా చెప్పెను. ఈవిషయము సుఖియా చెవిలో పడినది. ఆమెకు చైతన్యము తప్పినట్లాయెను. నేటికి ఆమెకు ౫౦ సం. వయస్సు. కాని ఈగకూడ ఆమె ముక్కుపై వ్రాలినది కాదు. ఈ దినమున ఆమెకు కొడుకు, కూతురుయొక్క తారతమ్యము తెలిసినది. "అయ్యో! రాముడు నన్ను తీసికొని పోరాదా. ఇటువంటి కూతురు కలుగుటకంటె సంతాన హీనముగా వుండుటే మంచిదే. ఆహా! నా గౌరవము మట్టిలో కలిసిపోయినది. నేనేమి చేయుదును?" అని దుఃఖించెను.

అక్కడ సాహుజీ చెవిలో ఈమాట పడగనే తలను రెండుచేతులతోను పట్టుకొనెను. చతురుని కోపించి ధర్మమును ఏల పాడుచేసితివని అడిగెను. కాని పాపము చతురూ ఏమి చెప్పగలడు. అక్కడ కేసరి స్థితియూ ఇట్లే ఆయెను.

ఒకదినము, ఎట్లో ఇద్దరు ప్రియులును కలిసికొనిరి. చతురూ కేసరితో "రమ్ము కేసో, ఎక్కడికైననూ పారిపోవుదము" అనెను.

"జనులు ఏ మనుకొనియెదరు?"

"లోకులతో అయినది, పోయినది ఏమికలదు?"

"లేదు, లేదు చతురూ !"

"అయితే కేసో! నా ప్రాణ ముండదు"

"చతురూ ! మా అమ్మ ఏమిచేయగలదు ? నేను పోయినచో మా తల్లికి దుఃఖము కలుగును. ముసలిది. నేనే ఆధారము. చతురూ! చతురూ ! అట్లు కాదు, నేను రాలేను."

"అయితే... నేను జీవించుట...

"లేదు చతురూ"

చతురూ దీర్ఘనిశ్వాసము వదలెను. కేసరి సంకటమందు పడినది—ఏమిచేయవలయును ?

అదిగో సరస్సు. లోయకూడ అదిగో. నేడునూ కమలములు మందహాసము చేయుచున్నవి. వెన్నెలలేత చిగురులపై ప్రసరించుచున్నది. చతురూ, కేసో ఇద్దరు సరస్సులో ప్రవేశించిరి. నీళ్లు ముఖమువరకు వచ్చెను. ఒకరి నొకరు బాహుపాశమందు కట్టుకొనిరి. అట్లే పోయి మునకవేసిరి. —హిందీనుండి.